క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో సామవేదం షణ్ముఖశర్మ



షణ్ముఖశర్మకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో భద్రాజీ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, వేద ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ ఈవో వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అంపోలు మాజీ సర్పంచ్ గొండు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కూర్మనాథాలయానికి భక్తుల తాకిడి



క్యూలైన్‌లో భక్తులు

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలో కూర్మనాథాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వచ్చి పుష్కరిణి వద్ద స్నానాలాచరించారు. రెండు వైపులా క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పర్యాటక భవనంలో మూడు వందల మందికి అన్నదానం నిర్వహించగా.. ఈవో గురునాథం పర్యవేక్షించారు.

గడప గడప బిల్లులు చెల్లించాలని ఆదేశం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన గడప గడపకు మన ప్రభుత్వం పనులకు సంబంధించిన నిధులు విడుదల చేయాలని రాష్ట్ర హైకోర్టు కూటమి ప్రభుత్వాన్ని ఆదేశించినట్లు ఎచ్చెర్ల ఎంపీపీ, హైకోర్టు న్యాయవాది మొదలవలస చిరంజీవి తెలిపారు. ఫరీదుపేటలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రూ.15 లక్షల పనులకు సంబంధించి కాంట్రాక్టర్ నేతింటి రాజు తరఫున హైకోర్టును ఆశ్రయించగా రెండు నెలల్లోపు బిల్లులు చెల్లించాలని ఆదేశాలు వచ్చాయని వెల్లడించారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: జరజాంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు క్షేత్రస్థాయి శిక్షణ నిర్వహించారు. ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రం తరఫున ప్రకృతి వ్యవసాయంపై 100 మందికి ఇస్తున్న సంగతి తెలిసిందే. నాలుగో రోజు క్షేత్రస్థాయిలో జీవామృతం, బీజామృతం, కషాయాల తయారీ, విత్తన శుద్ధి గులికలు తయారీ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.రేవతి మాట్లాడుతూ కార్యకర్తలు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై పూర్తిస్థాయిలో శిక్షణ పొంది రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

సివిల్ వివాదాల్లో తలదూర్చితే పీడీ యాక్ట్

శ్రీకాకుళం క్రైమ్ : సివిల్ వివాదాల్లో (భూ తగాదాల్లో) తలదూర్చితే పీడీ యాక్టులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు రౌడీషీటర్లను హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం రెండో పట్టణ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు సీఐ కౌన్సిలింగ్ నిర్వహించారు. రాజకీయ పార్టీల అండదండలతోగానీ, బంధువుల తరఫున గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ భూముల సెటిల్మెంట్లలో ఉండరాదన్నారు. పోలీసుల నిరంతర నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సంతోష్‌కుమార్, రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుశాలి కులస్తుల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పట్టుశాలి కులస్తుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. తోటపాలెంలోని వెంకన్నగారి తోటలో నిర్వహించిన పట్టణ పట్టుశాలి సంక్షేమ సంఘం కార్తీక మాస వనభోజన మహోత్సవానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో పట్టుశాలి సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు గుంటుకు చంద్రశేఖర్, పేకల రామకృష్ణ, సామాజికవర్గ ప్రతినిధులు, పెద్దలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఇదేం బాదుడు?



మత్రివలసలో రేకుల ఇంటికి వచ్చిన బిల్లులను చూపిస్తున్న ఎస్సీ లబ్ధిదారులు

- బిల్లుల సాకుతో పలు ఎస్సీ గృహాలకు విద్యుత్ నిలుపుదల
- అదనపు వాడకంపై వేలాది రూపాయల బిల్లులు చెల్లించాలని ఆదేశం
- ముందస్తు నోటీసులు ఇవ్వలేదని బాధితుల ఆవేదన

జి.సిగడాం: మండలంలోని పలు ఎస్సీ కుటుంబాలకు విద్యుత్ అధికారుల బిల్లుల రూపంలో షాకిస్తున్నారు. వేలాది రూపాయలు బిల్లులు తక్షణమే చెల్లించాలని, లేనిపక్షంలో కనెక్షన్లు తొలగిస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించేవారు. అదనంగా విద్యుత్ వాడితే వాటికి మాత్రమే బిల్లులు చెల్లించాల్సి వచ్చేది. అయితే ఈ ఐదేళ్ల ఒక్కసారి కూడా రాయితీపై కంటే ఎక్కువ విద్యుత్ వాడారని సంబంధిత అధికారులు సమాచారం ఇవ్వలేదు. ప్రతి నెలా అధికారులు బిల్లులు తీసుకుని వెళ్లిపోవడమే తప్ప మీరు అదనంగా కరెంట్ బిల్లు కట్టాలని ఏ రోజూ నోటీసులు ఇవ్వలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారిపోయింది. గత ప్రభుత్వంలో అదనపు విద్యుత్ వాడారని, అంతా ఒక్కసారే ఇప్పుడు కట్టాలని ఒక్కొక్కరికీ రూ. 10 వేల నుంచి రూ.46 వేల వరకు బిల్లులు తీసి ఎస్సీ లబ్ధిదారులకు షాక్ ఇచ్చారు. ఇలా జి.సిగడాం మండలంలో మత్రివలస, పెంట, ఆబోతులపేట, జి.సిగడాం, సంతవురిటి తదితర గ్రామాల్లో సుమారు 86 మందికి వేలాది రూపాయల బిల్లులు ఇచ్చారు. మండలం మొత్తం సుమారు రూ.12 లక్షల బిల్లులు చెల్లించాలని సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో పాటు కొన్ని గృహాలకు కరెంట్ సరఫరా కూడా నిలుపుదల చేశారు. ఒకేసారి ఇంత మొత్తంలో బిల్లు చెల్లించాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాగా, విషయమై తామేమీ చేయలేమని విద్యుత్ శాఖ అధికారులు చేతులెత్తేస్తున్నారు.



అధిక మొత్తంలో బిల్లు వచ్చిన గృహం ఇదే

రూ.35,670 బిల్లు వేశారు..



గత జగనన్న ప్రభుత్వ హయాంలో ఉచితంగా విద్యుత్ వాడుకున్నాం. 2వందల యూనిట్లు కంటే ఎక్కువ వాడుతున్నామని ఇప్పుడు 35,670 బిల్లు వేశారు. ఇలా ఎక్కువ వాడుతున్నామని గతంలో మాకు అధికారులు చెప్పలేదు. ఇప్పుడు ఒకేసారి ఇంత మొత్తం ఎలా చెల్లించాలి?

– కోడిగుడ్ల రమణమ్మ, మత్రివలస, జి.సిగడాం, మండలం

చీకట్లలో మగ్గుతున్నాం



మాది రేకుల ఇల్లు. మా ఇంట్లో ఫాన్, రెండు లైట్లు మాత్రమే ఉన్నాయి. జగనన్న హయాంలో మాకు ఇచ్చిన 2 వందల యూనిట్ల కంటే తక్కువే వాడాం. ఇప్పుడు బిల్లు మాత్రం రూ.15 వేలు చెల్లించమంటున్నారు. అందు వరకు విద్యుత్ సరఫరా చేయడం సాధ్యం కాదంటున్నారు.

– కె.అప్పన్న, మత్రివలస, జి.సిగడాం మండలం

కక్ష తగదు..



జగనన్న ప్రభుత్వ హయాంలో ఎస్సీలకు పెద్దపీట వేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించారు. అదనంగా విద్యుత్ వాడితే అధికారులు ఇన్నాళ్లూ ఏం చేశారు. ఇప్పుడు వేలాది రూపాయలు చెల్లించమంటే ఎలా. సీఎం చంద్రబాబుకు ఎస్సీలంటే అలుసు.

– బుడారి లక్ష్మణరావు, సర్పంచ్(ఎస్‌సి), సంతవురిటి

మహా కుంభాభిషేకాలకు సర్వం సిద్ధం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు

- నగరంలోని జీవేశ్వరాలయం వేదికగా నేటి నుంచి ఐదు రోజుల పాటు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోనే అతి పురాతనమైన దేవాలయాల్లో బోడెమ్మ కోవెల ప్రాంతంలోని జీవేశ్వరాలయం. సుమారు 300 ఏళ్ల చరిత్ర గల ఈ దేవాలయం మహా కుంభాభిషేక ఉత్సవాలకు సిద్ధమైంది. ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు ఐదు రోజుల పాటు శివపంచాయతన సహిత రుద్ర యాగ పూర్వక మహా కుంభాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అర్చకులు వెంకటేశ్వరావు, చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులతో కలిసి ఆదివారం ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది కార్తీక మాసంలో చండీయాగం, రుద్రాభిషేకాలు చేశామని తెలిపారు. ఈ ఏడాది 25న సిద్ధి బుద్ధి సమేత గణపతి కల్యాణం, 26న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం, 27న లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం, 28న సూర్యనారాయణస్వామి కల్యాణం, 29న ఆలయ శిఖరానికి 1100 కలశాలతో మహాకుంభాభిషేకం, శివపార్వతుల కల్యాణం, 30న విగ్రహాల ఊరేగింపు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు యాగశాలతో పాటు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరణలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బుర్రా వెంకటరావు, తాళాడ రవీంద్ర, బస్వా రవి, యాగాటి ప్రసాద్, చిత్రడ గాంధీ, బబ్బాది లక్ష్మణరావు, రాయితి చంద్రశేఖర్, గణగళ్ల కొర్లయ్య, శిల్లా శ్రీరామమూర్తి, తంగుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ఆకర్షణగా విగ్రహాలు



సిద్ధమైన యాగశాల

ముమ్మరంగా కోతలు



శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని వప్పంగి, సానివాడ, సింగుపురం, కల్లేపల్లి, కిల్లిపాలెం తదితర ప్రాంతాల్లో వరి కోతలు ఊపందుకున్నాయి. కోసిన వరిని అక్కడికక్కడే కుప్పలు పెడుతున్నారు. మండల వ్యాప్తంగా 14వేల హెక్టార్లలో వరిపంట పండించారు.

– శ్రీకాకుళం రూరల్

పొంచి ఉన్న ప్రమాదం



శ్రీకాకుళం–రాజాం ప్రధాన రహదారిలో దవళపేట సమీపంలో కల్వర్టు వద్ద భారీగా గొయ్యి ఏర్పడింది. దీంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

– జి.సిగడాం

అసంపూర్తి ప్రహరీతో పాట్లు



విద్యార్థుల భద్రతకు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రహరీ కీలకం .అయితే దుప్పలవలసలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలలో ప్రహరీ అసంపూర్తిగా, తక్కువ ఎత్తులో ఉంది. దీంతో కొందరు విద్యార్థులు ఉపాధ్యాయుల కళ్లుగప్పి బయటకు వెళ్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

– ఎచ్చెర్ల క్యాంపస్

నీరు గారిన ఆశయం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పచ్చదనం–పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా గ్రీన్ వర్సిటీ ర్యాంకింగ్ కోసం ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని వెదురు బుట్టలు ఏర్పాటు చేశారు. అయినా కొందరు వాటిని వినియోగించకుండా ప్లాస్టిక్ డ్రమ్ముల్లోనే చెత్తను పడేస్తూ ఆశయానికి తూట్లు పొడుస్తున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

పారదర్శకంగా ఓటర్ల జాబితా



దరఖాస్తులు స్వీకరిస్తున్న తహశీల్దార్ సింహాచలం

ఎచ్చెర్ల క్యాంపస్: పద్దెనిమిదేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ఎచ్చెర్ల తహశీల్దార్ ఎ.సింహాచలం అన్నారు. పొన్నాడలో ఆదివారం ఓటర్ల నమోదు శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలు పారదర్శకంగా సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు, కొత్త ఓటర్ల నమోదు, మృతి చెందిన వారి ఓట్లు జాబితా నుంచి తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు ఇంటింటా సర్వే చేపట్టి అర్హులను ఓటర్లుగా చేర్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ



ఎన్‌సీసీ క్యాడెట్లతో ప్రిన్సిపాల్ సురేఖ, ఎన్‌సీసీ అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రమశిక్షణ, సేవాభావం ఎన్‌సీసీ ద్వారా అలవడుతాయని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ తెలిపారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ) 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో భాగంగా కళాశాల ఎన్‌సీసీ భవనం వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని, దేశసేవకు ప్రతిరూపంగా ఎన్‌సీసీ క్యాడెట్లు నిలుస్తారని కొనియాడారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి డాక్టర్ పోలినాయుడు, జి.ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, సింహాద్రి, వేణుగోపాల్, జోగినాయుడు, ఎస్.సంజీవరావు, జి.లక్ష్మి, పావని, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



సాయం అందిస్తున్న సాయికుమార్

జి.సిగడాం:

మండలంలోని సంతవురిటిలో ఈ నెల 23న జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి, రణస్థలం ఎంపీపీ ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ సర్పంచ్ బుడారి లక్ష్మణరావు సమక్షంలో బియ్యం, దుస్తులు, సరుకులు ఆదివారం అందించారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో దవళపేట సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, మాజీ సర్పంచ్ పిన్నింటి లక్ష్మునాయుడు వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, ఉప సర్పంచ్ చందనాల గణపతి, నాయకులు చందనాల రంగారావు, వాండ్రంగి వెంకటేష్, బాలబొమ్మ శ్రీనివాసరావు, సింహాచలం పాల్గొన్నారు.

గూడు చెదిరింది.. గోడు మిగిలింది



కాలిపోయిన ఇంటి వద్ద దీనంగా కుటుంబ సభ్యులు

జి.సిగడాం: వారంతా రెక్కాడితే గానీ డొక్కాడని పేదలు. కూలీ నాలీ చేసుకుంటూ జీవనపోరాటం సాగిస్తున్నారు. పగలంతా కష్టపడి రాత్రి సమయంలో తాటికమ్మల గుడిసెలో విశ్రాంతి తీసుకుంటారు. అలాంటి వారిపై విధి కన్నెర్ర చేసింది. అగ్ని ప్రమాదం రూపంలో నిరాశ్రయులను చేసింది. జి.సిగడాం మండలం సంతవురిటిలో ఈ నెల 23న జరిగిన అగ్ని ప్రమాదంలో తొమ్మిది ఇళ్లు కాలిబూడిదైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం బాధితులంతా గూడు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓవైపు చలిగాలులు, మరోవైపు పిల్లల ఆర్తనాదాలతో మొండిగోడల వద్ద దిగాలు ఉంటూ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సంతవురిటి సర్పంచ్ బుడారి లక్ష్మణరావు కోరారు.

పొన్నాడ కేజీబీవీ పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)ను ఎచ్చెర్ల తహశీల్దార్ ఎ.సింహాచలం ఆదివారం సందర్శించారు. విద్యార్థినులకు పెడుతున్న భోజనం, పాఠశాల ఆవరణ, పరిసరాలు, పారిశుద్ధ్యం తదితర అంశాలు పరిశీలించారు. ప్రత్యేకాధికారి సుర్యకళతో మాట్లాడి విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు.

శ్రీనివాస మందిరంలో ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని శ్రీ శ్రీనివాసా ప్రార్థనా మందిరంలో కార్తీక మాస ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి సహస్ర తులసీదళార్చన పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

గార: మొగదాలపాడు బీచ్ సమీపంలోని జీడి తోటల్లో రెండు చోట్ల పేకాట ఆడుతున్న 12 మందిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5005, రూ.3700 స్వాధీనం చేసుకొని, కేసు నమోదుచేశామని ఎస్ఐ ఆర్.జనార్దన తెలిపారు.

స్వచ్ఛ శ్రీకాకుళమే లక్ష్యం



సమావేశానికి హాజరైన క్లబ్‌ల ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): స్వచ్ఛ శ్రీకాకుళం సాధనే లక్ష్యంగా ముందుకు సాగుదామని హర్షవల్లి లయన్స్‌క్లబ్, వాకర్స్ ఇంటర్నేషనల్, స్టార్ వాకర్స్ సంస్థల ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు నగరంలో హర్షవల్లి లయన్స్‌క్లబ్ కార్యాలయంలో ఆదివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కోరిక మేరకు హోం కంపోస్ట్ తయారీ ప్రాజెక్టుపై చర్చించారు. సమావేశంలో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పూజ నిర్వహిస్తున్న రేజ్‌కుమార్ నంబూద్రి, అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: బలగ అయ్యప్పస్వామి దేవాలయంలో ఆరాట్టు బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. శబరిమలకు చెందిన మాలికాపురం మేల్ శాంతి రేజ్‌కుమార్ నంబూద్రి, ఆలయ అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ, మణిదీపక్ శర్మ, కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో అష్టాభిషేక అర్చనలు, అలంకరణ, విశేష దివ్య దీపాలంకరణ, వేద పారాయణ, పుష్ప అలంకరణ విశేషంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి చిరంజీవి, దానేటి రాజారావు, కమిటీ సభ్యులు, దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు. సోమవారం నాగావళి నదిలో మణికంఠ పుష్కరిణి ఘాట్ వద్ద స్వామివారికి అభిషేకాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెంలో ఆదివారం అయ్యప్పస్వామి పడి పూజ ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో స్వాములతో పాటు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు హాజరయ్యారు. మధ్యాహ్నం అన్న సమరాధన ఏర్పాటు చేశారు.



బలగ అయ్యప్ప ఆలయంలో పడిపూజ



తోటపాలెంలో ప్రత్యేక పూజలో అయ్యప్ప స్వాములు

చదువుతోనే బంగారు భవిష్యత్



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: చదువుతోనే బంగారు భవిష్యత్ సొంతమవుతుందని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు వల్ల కలిగే దుష్ప్రభావాలు తెలియజేస్తూ అరసవిల్లి జంక్షన్ నుంచి సూర్యమహల్ వివేకానంద విగ్రహ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ పైడాపునాయుడు, కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివ శంకర్ ఎన్ఎస్ఎస్ ఎల్.మోహనరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, పైడి రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.